❖•❖•❖ 42 ❖•❖•❖

# క్షమాపణ అంటే?

*“వారు కపాలమనబడిన స్థలమునకు వచ్చినప్పుడు అక్కడ కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని, ఆ నేరస్థులను ఆయనతో కూడ సిలువవేసిరి. యేసు – ‘తండ్రీ, వీరేమీ చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని’ చెప్పెను ...” (లూకా 23:33, 34).*

సువార్త రచయితలు యేసు మేకులతో సిలువకు దిగగొట్టబడిన ఆ భయంకరమైన క్షణము గూర్చి ఎక్కువగా వ్రాయలేదు. వాస్తవమునకు, వారు కేవలము దానిని పరోక్షంగా సూచించారు. ప్రతి ఒక్క సువార్తికుడు దాని క్షణికదృష్టిని మూడు నాలుగు మాటల్లో చూపిస్తున్నాడు. ఉదాహరణకు “అక్కడ ... ఆయనను సిలువవేసిరి” అని లూకా మామూలుగా చెప్పుచున్నాడు (లూకా 23:33). నిర్దాక్షిణ్యమును నిష్ఠురమునైన వివరాలను విడిచిపెట్టుచూ, ఆయన సిలువమీద వ్రేలాడుచుండిన ఆ సుధీర్ఘమైన గడియలలో, యేసు చేసిన పనులను చెప్పిన మాటలను తెలియజెప్పుటకు లేఖనములు త్వరత్వరగా ముందుకు సాగుచున్నవి.

యేసు సిలువ మీద వ్రేలాడుచుండినప్పుడు ఆయన పలికిన ఏడు మాటలను మనము చదువుదుము. ఆయన ముమ్మారు దేవునితో ప్రార్థనాపూర్వకంగా మాట్లాడాడు, నాలుగు పర్యాయములు సిలువ చెంత నుండిన వారితో మాటలాడాడు. తన ప్రార్థనలలో, ఆయనను సిలువవేయుచుండిన వారి గూర్చియు (లూకా 23:34), ఆయన అనుభవించుచుండిన అనుభూతుల గూర్చియు (మత్తయి 27:46), మరియు తన ఆత్మను దేవునికి అప్పగించుకొనుట

గూర్చియు (లూకా 23:46) ఆయన దేవునితో మాటలాడాడు. ఆయన తన చుట్టు ఉండిన వారిని సంబోధించినప్పుడు, తన ప్రక్కలో సిలువవేయబడి యుండిన దొంగకు పరదైసు యొక్క నిరీక్షణను కలుగజేస్తూ వానితో మాటలాడాడు (లూకా 23:43); తన తల్లితోను అతడు తన తల్లి గూర్చి తగు శ్రద్ధ వహించవలెనని అపొస్తలుడైన యోహానుతోను (యోహాను 19:27); ఆయన దప్పిగొనుచున్నానని చెప్పినప్పుడు ప్రతిస్పందించి ఆయనకు అతి సమీపంగా ఉండిన ఒక అనామీక వ్యక్తితోను (యోహాను 19:28); మరియు తన ప్రేషణ "సమాప్తమైనది" (యోహాను 19:30) అను విజయీభవ మాటల్లో ఘోషిస్తూ, ఈ విశాల విశ్వములోని సమస్త జనులతోను మాటలాడాడు.

సముచిత రీతిలో, యేసు సిలువ మీద నుండి పలికిన పలుకలలో మొట్టమొదటిది ఆయన చేసిన మూడు ప్రార్థనలలో ఒకటై యుండెను. ఆయన తన జీవితంలో అనుదినం ప్రార్థించాడు; గనుక ఆయన తన చివరి గడియలలో సహితము ప్రార్థిస్తాడని మనము ఆశించుట సహజమే. ఈ మొట్టమొదటి ప్రార్థనలో, ఆయన ఎలాగైనాసరే సిలువ వేయబడవలసినదే అని సకల పన్నాగములు పన్నుటకు ఏకీభవించిన వారి నిమిత్తమై దేవుని క్షమాపణ కొరకు ఆయన ప్రార్థించాడు. ఈ ప్రార్థనను అతి జాగ్రత్తగా అధ్యయనము చేసినవారు ఇది ఎప్పుడైనా గాని చేయబడిన ప్రార్థనలలో ఒక అత్యంత శోభాయమానమైన మనోభావ రసస్ఫూరిత ప్రార్థన యని గుర్తించారు. అది ఎల్లప్పుడు ఆయన హృదయములోని ఒక విశేష లక్షణమై యుండిన కరుణాకటాక్షముతో, "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" అని యేసు చేసిన ప్రార్థనయై యున్నది (లూకా 23:34ఎ).

ఆయన హస్తములు మరియు పాదములు మేకులతో సిలువకు దిగగొట్టబడుచుండిన సమయంలో లేదా, ఆ కార్యము ముగిసిన కొద్దిసేపటికి ఈ విజ్ఞాపనా ప్రార్థన చేయబడియుండుట ఎక్కువ సంభావ్యమై యున్నది. బహుశ ఆయన సిలువకు కట్టివేయబడుచుండినప్పుడును ఆ తరువాతనైనను చేయబడియుండవచ్చును. ఆయన ఈ ప్రార్థన పలుమార్లు చేసియుండవచ్చును, ఏలయనగా లూకా 23:34లో గల "చెప్పెను" (*elegen*) అను క్రియా పదము భూతకాలము కొనసాగుచుండుటను సూచించుచున్న ఒక అసమాపక క్రియా పదమై యున్నది. అనగా, అది ఆయనను భయంకరముగా బాధించుచుండిన వారి క్షమాపణ నిమిత్తము ప్రార్థించుటను సిలువవేయబడుచుండిన తొలి గడియలలోనుండే ఆయన హృదయంలో అదేపనిగా కొనసాగుచుండిన ఆశ మరియు చర్యయై యుండెనని మరోమాటలో చెప్పుకొనవచ్చును.

యేసు సిలువకు దిగగొట్టబడి ఆ చిత్రహింసా సాధనము దాని కొరకు సిద్ధము చేయబడిన రంధ్రము గుండా గట్టిగా దిగగొట్టబడినప్పుడు, ప్రేక్షకులు సిలువల చుట్టూర గిరగిరా తిరుగుటకు మొదలుపెట్టారు. కొందరు సిలువపై వ్రేలాడుచుండిన వారి హాస్యాస్పదమైన దృశ్యాన్ని ఊరకనే తమాషాగా చూడటానికి వచ్చారు, మరికొందరు యేసు మీదకు దూషణ మాటలు విసరడానికి వచ్చారు (మత్తయి 27:39, 40). అప్పటికే మరణము యొక్క దుర్గంధము గాలిలో కలిసిపోయింది, మానవ రక్తపు వాసనను వీచుచుండిన చల్లని గాలులు మరింత వ్యాపింపజేశాయి.

స్పష్టంగా, ఈ గొప్ప విషాదాంతములోని ఏదో ఒక సందర్భములో – ఆయన కొరకు వేచియుండిన సుదీర్ఘమైనదియు, వేదనకరమైనదియునైన మరణము కొరకు యేసు ఎదురుచూచుచుండినట్లు – ఆయన ఈ ప్రార్థన చేయడం మొదలుపెట్టాడు. మానవులు

ఎప్పుడైనా ఎరిగియున్న అత్యంత కృపసహితమైన గొప్ప చర్యలో, ఆయన తన బలమును కూడగట్టుకొని ఆయనను సిలువవేయుటలో పాల్గొనుచుండినవారందరి నిమిత్తము విజ్ఞాపన చేయుట కొనసాగించాడు.

లోకము గతించిపోకుండా నిలిచియుండునంత కాలము ఆయన చేసిన ప్రార్థన ఎన్నటికినీ మరువబడదు. దానిలో గల అంతర్భావము చొప్పున అది మనకు క్షమాపణ గూర్చిన ఒక నిర్వచనమును ఇచ్చుట మాత్రమే గాక, ఆయన చూపిన మాదిరి ద్వారా క్షమాపణ యొక్క సరియైన పరిమాణములను కూడా చూపించుచున్నది.

ఆయన పరిచర్య చేయుచుండిన రోజుల్లో, యేసు క్షమాపణ గూర్చి తరచుగా చర్చించాడు (ఉదాహరణకు మత్తయి 6:14, 15 చూడుము); కానీ సిలువమీద, ఆయన ఈ ప్రార్థన చేయుచుండగా, అది అతి చిరస్మరణీయముగా నిలిచియుండునట్లు ఆయన దానిని ప్రదర్శించాడు. యేసు విషయంలో, ఆధ్యాత్మిక జీవితమునకు క్షమించు మనస్సు ఒక అత్యావశ్యకమైన వైఖరియై యుండినది. శీలములోని ఇతరమైన ఏ గుణలక్షణము కంటెను, హృదయము యొక్క ఈ లక్షణము దేవుని హృదయమును బయలుపర్చునను భావమును ఆయన సూచించాడు.

ఒకని యెడల పలుకబడిన పాపిష్ఠియైన పదమును, చేయబడిన దుర్మార్గపు కార్యమును లేదా, వ్యక్తము చేయబడిన కపటపు ఆలోచనను వానికి విరోధముగా చేసిన వాని విషయములో యిక ఎన్నటికిని తన మనస్సులో ఉంచుకొనడని గాయపర్చబడినవాడు తీర్మానించుకొనినప్పుడు యథార్థమైన క్షమాపణ కనబడుతుంది. యేసు ఈ ప్రార్థనా పదబంధమును రూపొందించిన క్షణము మొదలుకొని సమృద్ధియైన జీవితమునకు సంబంధించిన ఒక నూతన యుగము లోకములోనికి ప్రవేశించింది – క్షమాపణ యొక్క ఆశ్చర్యకరమైన అర్థము గూర్చిన ఆధ్యాత్మిక వికాస యుగము ప్రవేశించింది.

ఇంతేగాక ఈ విన్నపమును యేసు చేశాడు గనుక, క్షమాపణా పరిమాణములను లోకము ఎల్లప్పుడు తెలిసికొంటుంది. ద్వేషభావముతో జీవించుటకు యిక ఎటువంటి నెపమైనను ఉండదు. ఆయన ప్రార్థన., అదొక పట్టకం (ప్రిజమ్) అయియున్నట్లుగా, ఆయన ప్రేమ యొక్క పరలోక వెలుగు ప్రతి కోణము ద్వారా ప్రకాశించునట్లు అనుమతిస్తూ, క్షమాపణను నలువైపుల ప్రసరింపజేస్తుంది.

మనము మన రక్షకుని పరిశుద్ధ బలియాగమునకు తగిన భయభక్తితో ఆయనను సమీపించి ఈ ప్రార్థనను జాగ్రత్తగా ధ్యానించుదము. దానిలో ప్రతిబింబింపబడియున్న నానావిధ కోణములను మనము గమనించుదము.

*మొదటిదిగా, క్షమాపణకు గల లోపలి వైపు పరిమాణమును గమనించుదాము.* క్షమాపణ, దాని మానవ పరిమాణములో, అది తప్పిదము చేసిన వాని దిశగా వెలుపలికి వెళ్లక మునుపు ఒకరి హృదయములో ఆరంభము కావలెనని యేసు చేసిన ప్రార్థన చూపించుచున్నది. ఇతరులు మనకు చేయునది కాదు, గాని మనము ఇతరుల గూర్చి మరియు వారు మనకు చేసిన దాని గూర్చి కలిగియున్న వైఖరే ప్రాముఖ్యమైన విషయమని ఈ ప్రార్థన సూచించుచున్నది.

క్షమాపణ మన యెడల చేయబడిన తప్పిదము మరియు ఆ దుష్కార్యము చేసిన వాని గూర్చిన ఉదార స్వభావముగల హృదయముతో ఆరంభమౌతుంది. అది, "నీవు చేసిన కార్యము యింత భయంకరమైనదై యున్నప్పటికిని, నేను దానిని నీకు విరోధముగా

మనస్సులో ఉంచుకొనను. ఒకడు పంజరములో నున్న ఒక పక్షిని నెమ్మదిగా బయటికి నెట్టుచు దానిని తట్టుచు, అది ఎగిరిపోవునట్లు చేయురీతిలో, నేను ఈ భయంకరమైన చర్యను విడిచిపెట్టుదును. నేను నీ వైపు చూచినప్పుడు, నీవు చేసిన ద్రోహమును మన మధ్య నిలువనీయను. నేను దానిని నీ చేష్టల పుస్తకములో నుండి తుడిపేస్తాను. నేను నిన్ను క్షమించి నీ కొరకు ప్రార్థించుటకు మొదలుపెట్టుతాను" అని చెప్పు వైఖరియై యున్నది.

యేసు ఒకరు ఊహించుకొనగల ప్రతి విధానములో చెడుగా వ్యవహరింపబడ్డాడు. ఆయన మీద అబద్ధముగా అపవాదం మోపబడింది, దొంగచాటుగా ఖండింపబడ్డాడు, మరియు ఘోరంగా సిలువవేయబడ్డాడు. తన జీవితకాలమందంతటను చెడుగా వ్యవహరింపబడినను, ఆయన హృదయము ఏ పాపము చేయలేదు; అట్లయినను ఆయన ఒక ఘోరాతిఘోరమైన నేరస్థునివలె సిలువవేయబడ్డాడు. ఇంత జరిగిననూ, ఆయనకు విరోధముగా పాపము చేసిరి వారి గూర్చి ఆలోచిస్తూ, దేవుడు వారిని క్షమించవలెనని, ఆయనను వేడుకొన్నాడు. ఆయన నిందకు నింద లేక శాపమునకు శాపమన్నట్లు సమాధానమిస్తూ, దెబ్బకు మారుదెబ్బ కొట్ట లేదు మరియు తిట్టలేదు. మనోభావాలను గాయపర్చుచుండిన వారి విమర్శలకు ఆయన ప్రతిస్పందించలేదు; ఆయన వారి కొరకు నిండు క్షమాపణా స్ఫూర్తితో ప్రార్థించాడు. వారిని శిక్షించుటకు బదులుగా, ఆయన వారి అంధకార నేరములను మరియు దుర్మార్గపు హృదయములను తన జాలితో కప్పివేశాడు.

ఎవరైనా మనకు విరోధముగా పాపము చేసినప్పుడు, అతనికి దేవునితో గల సమస్య అపరాధి మరియు అతడు మనకు విరోధముగా చేసిన అపరాధము పట్ల గల మన వైఖరి అది దేవుని యెదుట గల మన సమస్యయై యున్నది. మన పాపముల కొరకు తన కుమారుడు మరణించునట్లు ఆయనను అనుగ్రహించునంతగా మనలను ప్రేమించుచున్న వాని యెదుట నిలువబడినప్పుడు మనము మన మనస్సులో ఎటువంటి ద్వేషమును ఉంచుకొనకూడదు.

*రెండవదిగా, క్షమాపణ యొక్క వెలుపలి పరిమాణమును గమనించుదము.* సంబంధమును తెలిపే పరిమాణములో, అపరాధము చేసిన వాని దగ్గరకు వెళ్లి క్షమాపణ ఎంత సుందరమైనదో యని చూచుట ద్వారా వానిని సవాలు చేస్తుందని, యేసు చేసిన ప్రార్థన చూపించుచున్నది. అది మన హృదయాంతరాళములో నుండి మన యెడల అపరాధము చేసిన వారి హృదయాంతరాళములోనికి వెళ్లును. అలాగైతే అది మన యెడల అపరాధము చేసిన వానిని ఎల్లప్పుడు ప్రభావితము చేయకపోవచ్చును, కానీ అనేకసార్లు ప్రభావితము చేస్తుంది.

ఎవరైనా నీకు విరోధముగా పాపము చేసినప్పుడు, ఆ వ్యక్తి హృదయంలో ఒక విషాదాంతము సంభవించుచున్నదని నీవెరుగుదువు: నీకు విరోధముగా అపరాధము చేసిన వ్యక్తి ఆ విషాదాంతము గూర్చి నీకు తన అనుచిత ప్రవర్తన ద్వారా తెలియజేస్తున్నాడు. తన చర్యల ద్వారా, అతడు సహాయము కొరకు కేకలు వేస్తున్నాడు. "నేను కష్టములో చిక్కుకొన్నాను. నా జీవితము పాపము వశమగునట్లు నేను అనుమతించాను. దేవుడు ఎలా ఉంటాడో ఎవరైనా ఒకరు నాకు చూపిన బాగుండును. నేను మరణ లోయలో ఇరుకునబడ్డాను, జీవ మార్గమును నాకొకరు చూపించాల్సిన అవసరత ఉన్నది! అయ్యా, అమ్మా, నన్నెవరైనా కని-కరించి ఈ లోకములోని ఇతరులతో నేనెలా వ్యవహరించాలో నాకు చూపిస్తారా? నేను పోగొట్టుకొన్న నా జీవితాన్ని మరలా పొందుకొనునట్లు నాకెవరైనా సహాయం చేస్తారా?"

అని తన చెడ్డ మాటల ద్వారా లేదా తన దుష్ట కార్యముల ద్వారా నిన్నడుగుచున్నాడు. నీ యెడల అపరాధము చేసిన వాని పట్ల నీవు ప్రేమతోను జాలితోను, సున్నితత్వముతోను కృపాతిశయముతోను ప్రతిస్పందించినప్పుడు, నీవు అతనిలో గల అత్యంత లోతైన సమస్య నీవు పట్టించుకొనుచున్నావని అర్థం. అతని పట్ల ప్రేమతో ప్రతిస్పందించుట నీవు అతనికి చూపగల కృపగల కృపతో కూడిన ఒక సర్వోచ్ఛమైన సత్క్రియయైయున్నది.

నీకు విరోధముగా అపరాధము చేసిన వ్యక్తి హృదయము నీవు చూపించు జాలిచేత కరుగుతుందా? సాధరణంగా, ఔను కరుగుతుంది. "నేను నిన్ను సంపూర్తిగా క్షమించాను" అని చెప్పిన అతని ముఖములోనికి చూచిన తరువాత లోతుగా ప్రభావితము కాకుండా ఎవరుండగలరు? ఏదిఏమైనా, నీవు చూపిన ప్రేమచేత అతడు ప్రభావితము కానట్లయితే, అతడు చేసిన అపరాధము విషయములో నీవు సరిగానే ప్రతిస్పందించావనుటలో సందేహము లేదు. ఇతరులు ఆయన పట్ల దుష్టముగా వ్యవహరించినప్పుడు యేసు ఈ విధముగానే ప్రవర్తించాడు. గనుక మనము కూడ ఇదే విధముగా ప్రవర్తింపవలెను. అసలు మనమెందుకు కనికరము చూపాలి? మనము అతనిని క్షమించామని అవతలి వ్యక్తి గ్రహించినప్పుడు అతనిలో ఏమి జరుగునో అని మనము అనుగొనుదానినిబట్టి కాదు, గాని మనమేమైయున్నామో దానిని బట్టి మనము అలా కనికరిస్తాము. క్షమాపణ ఒకరు మరొకరి యెడల కలిగియుండగల ఒక అత్యంత అందమైన వైఖరియై యున్నది. అది నీవు మరొక మానవునికి ఇవ్వగల ఒక అత్యంత మృదులమైన వరమై యున్నది.

స్తెఫనుకు తప్పుడు తీర్పు తీర్చబడి అన్యాయపు శిక్ష విధింపబడింది. అతని నీతిమంతమైన జీవితమునుబట్టి అతడు రాళ్లతో కొట్టబడ్డాడు. పిన్న వయస్సులోనే, అతడు చంపబడ్డాడు; అతని కుటుంబము మరియు సంఘము నుండి వేరుచేయబడ్డాడు. ఇహలోకంలో అతని భవిష్యత్తు దౌర్జన్యపూరితంగా ద్వేషముతో నిండుకొని యుండిన వారి చేత సమాప్తం చేయబడింది. వారు అతని జీవితము పట్ల చేసిన ఘోర నేరానికి ప్రతిస్పందనగా అతడెంచేశాడు? వారు చేసిన పాపము అది వారు దేవునితో కలిగియుండిన వారి సమస్యయై యుండినది. కానీ వారు అతనికి చేయుచుండిన దాని గూర్చిన అతని వైఖరి దేవుని యెదుట అది అతని సమస్యయై యుండినది.

ఇటువంటి పరిస్థితిలోనే యేసు ఏంచేశాడో మరియు ఆగ్రహంతో నిండియుండిన అల్లరి మూక యెడల ప్రేమతోను, క్షమాపణతోను, మరియు కనికరముతోను ఎలా ప్రతిస్పందించాడో మరియు ఆగ్రహంతో నిండియుండిన అల్లరి మూక యెడల ప్రేమతోను, క్షమాపణతోను, మరియు కనికరముతోను ఎలా ప్రతిస్పందించాడో స్తెఫను జ్ఞాపకం చేసుకొన్నాడు. వారు రాళ్లు విసరుచుండగా ఆ దెబ్బలకు తట్టుకోలేకపోయిన అతడు తన మోకాళ్లపైబడి, "ప్రభువా, వారిమీద ఈ పాపము మోపకుము!" అని వారి కొరకు గొప్ప శబ్దముతో ప్రార్థించాడు (అపొస్తలుల కార్యములు 7:60). ఇంత గొప్ప ఉదాత్తమైన స్ఫూర్తితో మరణించుట ద్వారా, అతడు లోకానికి అది ఎన్నడూ మరువజాలని దేవుని హృదయము యొక్క ఒక కోణమును ప్రదర్శించాడు. "స్తెఫను ప్రార్థించియుండునట్లయితే, సౌలు ప్రబోధించియుండేవాడు కాదు" అని ఒకరన్నారు. యథార్థమైన క్షమాపణ వంక చూచు ఏ ఒక్కరునూ – యుగములన్నిటిలోని ఘోరాతిఘోరమైన హింసకుడైనను – దానిని చులకనగా చూడలేరు. స్తెఫనుయొక్క క్షమాపణా స్ఫూర్తి లోకములోనికి యుగ సమాప్తి పర్యంతము నిలిచియుండు ఒక అందమైన

సుగంధమును మందమారుతములో వెదజల్లి వ్యాపింపజేసినది.

*మూడవదిగా, క్షమాపణ యొక్క మీదివైపునగల పరిమాణమును గమనించుము.* క్షమాపణ, దాని దైవీక పరిమాణము చొప్పున, పైకి దేవుని యొద్దకు పంపబడవలెనని ఈ ప్రార్థన చూపించుచున్నది. యేసు, “తండ్రీ” అను మాటతో తన ప్రార్థనను మొదలుపెట్టాడు ఆయన దేవునికి విన్నవించుకొంటూ తన స్వరమును ఆయన వైపు ఎత్తాడు.

క్షమాపణ అనునది దేవుని హృదయములో మాత్రమే సంభవించునదై యున్నది. మనము పాపము చేసినప్పుడు, మనము దేవునికి విరోధముగా పాపము చేయుదుము. పాపము చేసిన తరువాత, దావీదుతో కూడా మనము, “నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసియున్నాను” అని చెప్పగలము (కీర్తనలు 51:4ఎ). దేవుడు మన సృష్టికర్తయై యున్నాడు. మరియు ఆయన మాత్రమే మన నిజమైన నైతిక న్యాయాధిపతియై యున్నాడు. సమస్త పాపము చిట్టచివరకు అంతములో అయనకు విరోధముగా చేయబడునదే. గనుక మన పాపముల పట్టిక ఆయనతో పరిష్కరింపబడనంత వరకు – ఇతరులు మన యెడల వ్యక్తము చేసిన వారి క్షమాపణా వైఖరి ఏదైనను, మనము దోషులముగానే నిలిచియుండి ఆయన యెదుట దండింపబడుదము. ఇతరులు మన యెడల చేసిన దాని గూర్చి మనము వారిని క్షమించవచ్చును, కానీ మనము వారి పాపములను తీసివేయలేము. దేవుడు మాత్రమే ఆ పని చేయగలడు.

తన ప్రార్థనలో, ఆయనను సిలువవేసినవారి యెడల యేసు యుక్తమైన స్ఫూర్తిని ప్రదర్శించుచుండెను. ఆయన వారి కొరకు ప్రార్థించి, వారిని క్షమించు విషయాన్ని తండ్రికి వదిలిపెట్టాడు. ఆయన ప్రార్థనకు సంపూర్తి సమాధానము పెంతెకొస్తు దినము వరకును రాలేదు. ఆ నాడు మూడు వేల మంది ప్రజలు – యేసు పిలాతు యెదుట నిలువబడి యుండినప్పుడు వారిలో, “సిలువవేయుము, వీనిని సిలువవేయుము!” అని కేకలు వేసిన కొందరు కూడా ఉండియుండవచ్చును (లూకా 23:21) – సువార్తకు విధేయులై క్రీస్తును అంగీకరించారు (అపొస్తలుల కార్యములు 2:38–47). వారు దేవుని రక్షణ ప్రణాళిక పట్ల చూపిన విధేయత ద్వారా క్షమించబడ్డారు. వారిని గూర్చిన యుక్తమైన వైఖరిని యేసు తన ప్రార్థనలో ప్రదర్శించాడు, కానీ వారు దేవుని క్షమాభిక్ష యొక్క షరతులను శిరసావహించనంత వరకు వారు క్షమింపబడలేదు.

మన యెడల అపరాధము చేసిన వారిని పరలోకమందున్న దేవుడు క్షమిస్తాడో లేదో నీవూ నేనూ నిర్ణయించలేము, కానీ మనము వారి యెడల క్షమాపణా స్ఫూర్తిని విస్తరింపజేయవచ్చును. యేసు చేసినది ఇదే, మరియు మనము కూడ చేయవలెనని యేసు మాదిరి మనలను బలవంతము చేయుచున్న విషయము కూడ ఇదే.

ఈసారి మనయెడల ఎవరైన తప్పిదము చేసినప్పుడు, మనము మన రక్షకుడు ఆయనను సిలువవేయుచుండిన వారి నిమిత్తము చేసిన ప్రార్థనను స్మరణకు తెచ్చుకొందాము: “తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము” (లూకా 23:34ఎ).

❖•❖•❖

*“నేరస్థుడు సిలువ మీద నిటారుగా నిలిచియుండునట్లు సాగదీయబడుచుండగా, ఆయన హస్తముల గుండా మేకులు దిగగొట్టబడినవి. పలుమార్లు ఆ క్షణంలో బాధితులు వారి శిక్షకు అమలుచేయువారిని*

*శపించుచు, ఒట్టుపెట్టుకొంటు తిట్టుచు, బాధతో బిగ్గరగా అరచుచు, ఉమ్మివేయుచుండెడివారు, కానీ యేసు, 'తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము' అని ప్రార్థించింది ఈ సమయంలోనే (లూకా 23:34). అప్పుడు తీవ్రముగా వేదన నొందుచు దానిపై బాధితుడు వ్రేలాడబడి యుండగా ఒక్క క్షణములో ఆ సిలువ పైకి ఎత్తబడి నేలలో ఉండిన గుంటలోనికి దాని క్రింది భాగము దింపబడినది."*[1]

---

సూచన

[1]William Barclay, *Crucified and Crowned* (London: SCM Press, 1961), 82.